# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సాంకేతికత ద్వారా ఆలోచనలతో ప్రజలకు ప్రయోజనం కలిగించాలని కలెక్టర్లకు సూచించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **దేశంలో 4 పైలట్ ట్రైనింగ్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే. రామ్మోహన్ నాయుడు.**

3. **హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు జీఓ జారీ చేసిన ప్రభుత్వం.**

4. **విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సేవలు ఆన్ లైన్ లో అందుబాటులోకి రానున్నాయని వెల్లడించిన ఆలయ కార్య నిర్వహణ అధికారి శీనా నాయక్.**

============================

సాంకేతికత ద్వారా, సరికొత్త ఆలోచనలతో ప్రజలకు ప్రయోజనం కలిగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లుకు సూచించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రెండవ రోజు జిల్లా కలెక్టర్ల సదస్సు ఈరోజు జరుగుతోంది. విద్యార్థులకు జ్ఞానంతో పాటు విలువలు కూడా ముఖ్యమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలియజేస్తూ..

వాయిస్..30 సెకన్లు

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు 'ది ఎకనామిక్ టైమ్స్' అందించే 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు వచ్చినట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా తెలిపారు. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందుకోనున్నారు.

-------------------------

దేశంలో 4 పైలట్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో భాగంగా లోక్ సభలో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. కడపలో ఒక పైలట్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కడపలో ఎయిర్ పోర్ట్

టెర్మినల్ పనులు వచ్చే ఏడాది మార్చి నెలాఖరు కల్లా పూర్తి చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చెబుతూ..

.వాయిస్..30 సెకన్లు

---------------------------

పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –సర్‌లో భాగంగా సంబంధిత వ్యక్తులు విచారణకు హాజరుకావాలని నోటీసులు ఈరోజు నుంచి పంపనున్నట్లు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం తెలిపింది. నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణకు హాజరయ్యేందుకు ఏడు రోజుల గడువు ఉన్నట్లు పేర్కొంది. 85 సంవత్సరాలు పైబడిన వయస్సు గల ఓటర్లు విచారణ కేంద్రానికి ప్రత్యక్షంగా రావాల్సిన అవసరం లేదని, వారి నివాసాలకు ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, బూత్ స్థాయి అధికారి కలిసి వెళ్లి విచారణ నిర్వహిస్తారని స్పష్టం చేసింది.

---------------------------

2026వ సంవత్సరంలో హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు ప్రభుత్వం ప్రతి హాజీకి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ షేక్ హసన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సహాయం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

---------------------------

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని దినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తిరుపతి జిల్లాలోని ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో ఆర్థికంగా ఎదగడానికి దోహదపడుతుందని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని తిరుపతికి చెందిన గ్రామీణ రోజ్ గార్ యోజన పథకం లబ్దిదారుడు ఈశ్వరయ్య చెబుతూ...

వాయిస్..30 సెకన్లు

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సేవలు ఆన్ లైన్ లో అందుబాటులోకి రానున్నాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి శీనా నాయక్ తెలిపారు. విజయవాడలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. భక్తులు అత్యంత సులభంగా వైబ్ సైట్లు, యాప్, వాట్సప్ నంబరు ద్వారా టిక్కెట్లును బుక్ చేసుకోవచ్చని ఈవో శీనా నాయక్ సూచిస్తూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల

సేకరణ కార్యక్రమం ఈరోజుతో ముగిసింది. కోటి సంతకాల ప్రతులతో పలు జిల్లాల నుంచి వచ్చిన వాహనాలను ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్ మోహన్ రెడ్డి జెండా ఊపి లోక్ భవన్ కు పంపారు. అనంతరం ఆయన పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ఈ సాయంత్రం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో సమావేశం అవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కోవూరులో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధిపై కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రాష్ట్ర యువజన-క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని అమరావతి సచివాలయంలో ఈరోజు కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి వినతిపత్రం సమర్పించారు. ఇందుకూరుపేటలోని ఎం.కె.ఆర్ హైస్కూల్ ఆవరణలో ఉన్న 5.70 ఎకరాల భూమిలో 4 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సమగ్ర క్రీడా సముదాయాన్ని నిర్మించాలని కోరారు. దీనివల్ల గ్రామీణ యువతకు ఆధునిక క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

---------------------------

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు బాపట్ల జిల్లా వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు తెలిపారు. వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ సంజీవనిలా ఉపయోగపడుతుందని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న అయిదుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 2 లక్షల 9 వేల 194 రూపాయల నగదు చెక్కులను అందించినట్లు వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

దక్షిణ ఆఫ్రికా క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా.. ఐదు టీ 20 మ్యాచ్ సీరీస్ లో 5వ టి 20 క్రికెట్ మ్యాచ్ దక్షిణ ఆఫ్రికా, భారత్ జట్ల మధ్య రేపు జరగనుంది. గుజరాత్ అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌లలో భారత్ రెండు విజయాలు సాధించగా.. దక్షిణాఫ్రికా ఒక మ్యాచ్ గెలిచింది. 4వ టీ20 మ్యాచ్ పొగమంచు ప్రభావం అధికంగా ఉండటంతో నిన్న రద్దు అయింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న 5 రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

====================